టీనేజ్ టెంప్టేషన్స్‌పై అవగాహన

మాదాపూర్‌: మాదాపూర్‌లోని పత్రికనగర్ మెడికవర్ హాస్పిటల్ వద్ద యూ అండ్ మీ కౌన్సిలింగ్ సెంటర్‌లో రెండు రోజుల పాటు టీనేజ్ టెంప్టేషన్స్‌పై అవగాహన ఎగ్జిబిషన్‌ని నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లోయాంగర్, యాంగ్జైటీ, డిప్రెషన్, మొబైల్ అడిక్షన్ తదితర అంశాలపై అవగాహన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్‌: 9390771469లలో సంప్రదించవచ్చు.

వేర్వేరు ప్రాంతాల్లో కార్లు ఢీకొని ఇద్దరు మృతి



చందానగర్ : వేర్వేరు చోట్ల కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. చందానగర్ పోలీసులు తెలిపిన ప్రకారం.. శేరిలింగంపల్లి ఆలిండ్ కంపెనీ ఎదురుగా మంగళవారం తెల్లవారుజామున 4.00 గంటలకు వేగంగా వచ్చిన కారు ఓవ్యక్తి (55)ని ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసే దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో.. జీహెచ్‌ఎంసీ కార్మికుడు

గచ్చిబౌలి: హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతో కారు ముందుకు వెళ్లి ఢీ కొట్టడంతో ఓ జీహెచ్ఎంసీ కార్మికుడు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అత్రి ఆనంద్ పవార్(46) బతుకుదెరువు కోసం వలస వచ్చాడు. శేరిలింగంపల్లి జీహెచ్‌ఎంసీలో కార్మికునిగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో హెచ్‌సీయూ రెండో గేట్ సమీపంలో వాటర్ ట్యాంకర్ ఆపారు. మొక్కలకు నీళ్లు పోసేందుకు మోటార్ స్టార్ట్ చేయడానికి పెట్రోల్ పోస్తున్నాడు. ఆ సమయంలో ట్యాంకర్‌కు కొద్ది దూరంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉమాశంకర్ నిసాన్ కారును రోడ్డు పక్కన ఆపి పండ్లు కొనేందుకు వెళ్లాడు. హ్యాండ్ బ్రేక్ పడకపోవడం ఏటవాలుగా ఉండటంతో కారు ముందుకు వెళ్లింది. ట్యాంకర్ వద్ద ఉన్న ఆనంద్‌ను ఢీ కొట్టింది. నడుముకు తీవ్ర గాయాలు కావడంతో ఆనంద్‌ను ఉమాశంకర్ కేర్ ఆస్పత్రికి తరలించాడు. కొద్ది సేపటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..

- ఎమ్మెల్యే గాంధీ



శేరిలింగంపల్లిలోని స్ప్రింగ్‌వ్యాలీలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని స్ప్రింగ్‌వ్యాలీ కాలనీలో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఈస్ట్ సాయినగర్, మొగులమ్మ బస్తీ, పీజేఆర్ నగర్, దత్తాత్రేయ నగర్, శంషీగూడ, ఇంద్రహిల్స్, హెచ్‌యంటి శాతవాహననగర్, జయనగర్ కాలనీల్లో 2 కోట్ల 48 లక్షల 70 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- కోటి 70 లక్షల రూపాయలతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆధునికీకరణ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు పెద్ద ఆసుపత్రి టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కోటి 70 లక్షల రూపాయలతో ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 70 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. పైపులైన్లు, డ్రైనేజీలు, డోర్లు, ఫ్లోరింగ్ మరమ్మతుల కోసం ప్రభుత్వం ఇటీవల 70 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో పాటు ఏరియా ఆసుపత్రి పక్కనే నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిధుల నుండి మరో కోటి రూపాయలు ఏరియా ఆసుపత్రి మరమ్మతుల కోసం కేటాయించబోతున్నట్లు తెలిపారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆస్పత్రి సలహా సంఘం కమిటీ సభ్యులు కంకర సీనయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఏఈ రవీందర్ రెడ్డి, ఆస్పత్రి ఆర్ఎంవో ప్రవీణ, డాక్టర్ సల్మా పాల్గొన్నారు.

ఈశ్వరాంబ సంస్మరణ దినోత్సవం



సాంప్రదాయ దుస్తుల్లో బాలవికాస్ విద్యార్థులు



బుర్రకథ చెబుతున్న చిన్నారులు

రాయదుర్గం: బాలవికాస్ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంగళవారం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని సత్యసాయిసేవా సమితి గచ్చిబౌలి శాఖ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరాంబ వర్ధంతిని పురస్కరించుకొని సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస్ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు, దేవతామూర్తుల వేషధారణలు, హరికథ, బుర్రకథలను వినిపించారు. అనంతరం సత్యసాయిసేవా సమితుల రాష్ట్ర కోఆర్డినేటర్ హరనాథరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ సుబ్బారావు మాట్లాడుతూ సకల జీవరాశులకు తల్లే తొలిగురువు, దైవం అని పేర్కొన్నారు. తల్లిదండ్రుల గురించి తెలియజెప్పడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. సమితి ప్రతినిధి డాక్టర్ బిసి రామన్న పర్యవేక్షణలో సాగిన సమావేశంలో డివి కృష్ణారావు, మూర్తి, రాహుల్, రేవతిరెడ్డి, పద్మావతి, శశికిరణ్, వెంకట్‌రావు, భాస్కర్, ప్రదీప్, గాయత్రి, ఉషారాణి, బాలవికాస్ విద్యార్థుల తల్లిదండ్రులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి.రామస్వామియాదవ్, నాగిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

‘ఎఫ్‌డీడీఐ హైదరాబాద్‌లో దరఖాస్తునకు నేడు ఆఖరు

11న జాతీయస్థాయిలో ఏఐఎస్‌టి-2025 పరీక్ష

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్-హైదరాబాద్‌లో కోర్సులలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం చివరితేదీగా నిర్ణయించారు. ఎఫ్‌డీడీఐలో గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులు రెండూ అందుబాటులో ఉంటాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దరఖాస్తు చేసుకున్న వారి కోసం దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రధాన నగరాల్లో ఈనెల 11వ తేదీ ఆలిండియా సెలక్షన్ టెస్ట్ (ఏఐఎస్‌టీ-2025)ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా అడ్మిషన్స్-2025లో లేటరల్ ఎంట్రీ (డైరెక్ట్ సెకండియర్)లో అడ్మిషన్ కల్పిస్తారు. అందుకోసం అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు (నాలుగేళ్ల బి.డీఈఎస్) ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, ఫ్యాషన్ డిజైన్, లెదర్ లైఫ్ స్టైయిల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్ కోర్సు అందుబాటులో ఉంటుంది. వివరాలకు ఫోన్‌నెంబర్ 94404 71336, 8124513192లో సంప్రదించాలని ఎఫ్‌డీడీఐ అధికారులు తెలిపారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

శేరిలింగంపల్లి: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ భోర్ఖడేను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం కలిశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ వి ప్రశాంతిని కలిశారు. శేరిలింగంపల్లి డివిజన్‌లో చేపట్టిన, పెండింగ్‌లో ఉన్న, పూర్తి చేయాల్సిన అభివృద్ధి పనులను వారికి వివరించారు. నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఎగ్జిబిషన్‌తో ఇబ్బందులంటూ అపార్ట్‌మెంట్‌వాసుల నిరసన



నిరసన తెలుపుతున్న కెఎస్ఆర్ టూ గెదర్‌మెట్స్ అపార్ట్‌మెంట్స్‌వాసులు

చందానగర్ : మియాపూర్ సితార హోటల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన రెయిన్ బో ఎగ్జిబిషన్ వల్ల ఇబ్బందులుపడుతున్నామంటూ కెఎస్ఆర్ టూ గెదర్‌మెంట్స్ అపార్ట్‌మెంట్ వాసులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్‌వాసులు మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా పండగ, సెలవుల సమయాలలో అమ్యూజ్‌మెంట్, ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారన్నారు.ఈ ఎగ్జిబిషన్‌కు జీహెచ్‌ఎంసీ, ఫైర్, పోలీస్ అధికారుల అనుమతులు లేవన్నారు. కాగా గత కొన్ని రోజుల నుంచి గాలివాన వస్తున్న నేపథ్యంలో ఎగ్జిబిషన్‌లో షెడ్ రేకులు తదితర వస్తువులు ఎగిరి పడుతున్నాయన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నామన్నారు. రాత్రి సమయాలలో శబ్దాలతో వల్ల వృద్ధులు, చిన్నారులు భయపడుతున్నారన్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

కొత్త సీవరేజీ లైన్ అవసరం



అల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని కమల ప్రసన్ననగర్‌కాలనీలో జీహెచ్‌యంసీ, హైదరాబాద్ మెట్రో వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులతో వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మంగళవారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమల ప్రసన్ననగర్ రోడ్డు నంబర్ 12, 13లలో సీవరేజ్ లైన్‌లు చిన్నవిగా ఉండటంతో తరచూ మురుగునీరు రోడ్డుపైకి వస్తోందన్నారు. కొత్తగా లైన్ వేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో మంజూరు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామని అన్నారు. అదే విధంగా సిమెంట్ రోడ్డు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌యండబ్ల్యూయస్ అండ్ ఎస్‌బి మేనేజర్ ప్రియాంక, జీహెచ్‌యంసీ నిఖిల్, కాలనీ అధ్యక్షులు శేఖర్, రాఘవులు, ఆంజనేయులు, రాజు, శ్రీశైలంగౌడ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లు కట్టడాలను తప్పనిసరిగా పర్యవేక్షించాలి

- ‘ఎస్కీ’ డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: సిమెంట్, స్టీల్‌తో నిర్మించే కట్టడాలను తప్పనిసరిగా ఇంజనీర్లు స్వయంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అన్నారు. సిమెంట్, స్టీల్‌తో నిర్మించే గృహ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు కనీసం 30 నుంచి 40 ఏళ్ళ వరకు ఉండే విధంగా డిజైన్ చేస్తారని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో ‘ఎఫెక్ట్స్ ఆఫ్ కరోజన్ ఆన్ టీఎంటీ బార్స్ అండ్ బిల్డింగ్ స్ట్రక్చర్స్’ అనే అంశంపై ప్రత్యేక సెమినార్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టులు, సాగునీటి ప్రాజెక్టులు, ఓడరేవులు, రైల్వే, భారీ వంతెనలు వందేండ్లకు పైగా ఉండే విధంగా డిజైన్ చేస్తారని నిర్వహణ కోసం కొంతమేర ఖర్చు చేస్తే శాశ్వతంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఆవిర్భావంనుంచి ప్రస్తుతం పనిచేస్తున్న వివిధ డిజైన్లకు సంబంధించి ప్రజెంటేషన్‌ను ఇచ్చారు. సమావేశంలో ప్రొఫెసర్ కె గణేష్‌బాబు, డాక్టర్ వెంకట్ దిలీప్, సిటీ విభాగం హెడ్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి, సిహెచ్ తిలక్, సునీత పాల్గొన్నారు.